క్లుప్తంగా

బంగారు పతక విజేతకు సత్కారం

కర్నూలు (టౌన్): అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో కర్నూలు నగరానికి చెందిన క్రీడాకారిణి టీ.ఎం.హరిప్రియ బంగారు పతకం సాధించింది. పతకం సాధించిన విద్యార్థినిని మంగళవారం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తన నివాసంలో అభినందించారు. శాలువా కప్పి సన్మానించి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీల్లో తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడాంశంలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు మహిళ ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో నిర్వహించే జాతీయ పోటీల్లో రాణించాలన్నారు. తైక్వాండో కోచ్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

పదోన్నతి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా ట్రెజరీ కార్యాలయంలో జూనియర్ అకౌంటెంటుగా పనిచేస్తున్న షేక్ షమీమ్‌కు సీనియర్ అకౌంటెంటుగా పదోన్నతి లభించింది. సీనియర్ అకౌంటెంటుగా జిల్లా ట్రెజరీ కార్యాలయంలోనే పోస్టింగ్ ఇచ్చారు. పోస్టింగ్ కాపీలను అసోషియేషన్ నేతలతో కలసి జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్రరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ వీసీహెచ్ వెంగళరెడ్డి, ఏపీటీఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి జెడ్.కరుణాకర్, జిల్లా అధ్యక్షుడు రవికుమార్,ఏటీఓలు సుబ్బరాయుడు,జయలక్ష్మి, రమణయ్య, ఎస్టీఓ కరుణాకర్ పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని సాయిబాబా సంజీవయ్య నగర్‌లో కోట సుంకులమ్మ మహోత్సవం వైభవంగా జరిగింది. వర్షాలు బాగా కురవాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, రైతన్నలు అధిక దిగుబడి సాధించి అభివృద్ధి పథంలో నడవాలని కోరుకుంటూ భక్తులు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కాలనీ పెద్దలు, ఆలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోస్టుల విషయంలో దళారులను నమ్మొద్దు

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పోస్టుల భర్తీపై దళారుల మాట నమ్మవద్దని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మెడికల్ కాలేజీల్లో వివిధ కేటగిరీలకు చెందిన పోస్టుల భర్తీ విషయంలో ఫైనల్ మెరిట్ లిస్టును పూర్తిగా నియమ నిబంధనల మేరకు రూపొందించామని, ఈ పోస్టుల భర్తీలో ఎలాంటి అక్రమాలకు తావులేదని, ఎవరైనా దళారులు ప్రలోభాలకు గురిచేస్తే నమ్మవద్దని సూచించారు. ప్రలోభాలకు గురిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే 19న జరిగే కౌన్సెలింగ్‌లో కార్డియాలజీ టెక్నీషియన్ పోస్టులకు కౌన్సెలింగ్ ఉండదన్నారు. దీన్ని మళ్లీ ప్రకటిస్తామన్నారు. సర్టిఫికెట్లు ఒరిజినల్ అని తేలిన తర్వాతే వేతనాలు చెల్లిస్తామని, నకిలీవని తేలితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యోగాతో శరీరం, మనస్సు సమతుల్యత

కర్నూలు(హాస్పిటల్): రోజువారీ దినచర్యలో భాగంగా యోగాభ్యసన చేయాలని, దీనివల్ల శరీరం, మనస్సు సమతుల్యత సాధించి ఆరోగ్యంగా ఉంటామని చౌడేశ్వరిదేవి సేవా సమితి ప్రెసిడెంట్ నాగరత్నమ్మ చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం స్థానిక వర్కింగ్ ఉమెన్స్‌కు యోగా ప్రాధాన్యత, యోగా రిజిస్ట్రేషన్, శ్వాస వ్యాయామాలు, భౌతిక భంగిమలు, ధ్యానం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు (అగ్రికల్చర్): కర్నూలు నగరంలో వివిధ అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నందున బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు అర్బన్ డీఈ నాగప్రసాద్ తెలిపారు. అశోక్ నగర్, వెంకటరమణ కాలనీ, కప్పల్ నగర్, అమీన్ అబ్బాస్ నగర్‌లతో పాటు బి-రోడ్ సెక్షన్ పరిధిలోని కోడుమూరు రోడ్డు, హోసన్నా మందిర్, మల్లారెడ్డి వెంచర్ ఏరియాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆయన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాలస్తీనా, ఇరాన్‌పై యుద్ధం ఆపాలి

కర్నూలు(సెంట్రల్): తక్షణమే పాలస్తీనా, ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధాన్ని ఆపాలని, ఆయా దేశాల్లో శాంతిని నెలకొల్పాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు కోరారు. మంగళవారం సీఐటీయూ ఓల్డ్ సిటీ ఆధ్వర్యంలో గడియారం ఆసుపత్రి సమీపంలో సంఘీభావ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ఇజ్రాయెల్ పాలస్తీనా, ఇరాన్‌లో రక్తపాతం పారిస్తోందన్నారు. యుద్ధంలో పసిపిల్లలు, మహిళలు అని కూడా చూడకుండా అతికిరాతంగా దాడులు చేసి చంపుతోందన్నారు. ఇది చాలా దుర్మార్గమని, దీనిని ప్రపంచ దేశాలు ఖండించాలన్నారు. ఆయా ఆదేశాల్లో శాంతిని నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అబ్దుల్‌దేశాయ్, విజయ రామాంజనేయులు పాల్గొన్నారు.

జీఎస్టీ వసూళ్లపై దృష్టి పెట్టండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు (సెంట్రల్): జీఎస్టీ సజావుగా చెల్లించేలా ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని క్యాంప్ కార్యాలయంలో జీఎస్టీ అంశంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి పన్ను చెల్లింపుదారులు సక్రమంగా జీఎస్టీ చెల్లించేలా కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌కు సహకరించాలని అధికారులను ఆదేశించారు. రిజిస్టర్ చేసుకోకుండా వ్యాపారాలు చేసేవారు, కాంట్రాక్టర్లను రిజిస్ట్రేషన్ చేయించి పన్ను చెల్లించేలా చూడాలన్నారు. డిఫాల్టర్ల ఆస్తులను గుర్తించి, రికవరీ చేయించడంలో రెవెన్యూ శాఖ అధికారులు కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్లకు తగిన సహకారం అందించాలన్నారు. అలాగే నకిలీ డాక్యుమెంట్లతో అక్రమ రవాణా చేసే వారి విషయంలో మైనింగ్ శాఖ, రవాణా శాఖ అధికారులు కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌తో సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇంజినీరింగ్ శాఖలు ఆయా శాఖలకు సంబంధించిన కాంట్రాక్టర్లు జీఎస్టీ పన్ను సక్రమంగా చెల్లించేలా చూడాలని ఆదేశించారు. అదే విధంగా ప్రైవేటు సంస్థలు, ఔట్ సోర్సింగ్, ఇతర ప్రభుత్వ శాఖల్లో పని చేసే ఉద్యోగులు ప్రొఫెషనల్ ట్యాక్స్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా శాఖలకు సంబంధించి జీఎస్టీ పన్ను చెల్లింపుపై సంపూర్ణ అవగాహన కోసం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ కమర్షియల్ ట్యాక్స్ అధికారులను ఆదేశించారు. ప్రతి నెలా సమన్వయ సమావేశం నిర్వహిస్తామని, ఆలోపు ఆయా ప్రభుత్వ శాఖలు అందుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ జాయింట్ కమిషనర్ సుధాకర్‌రావు, డిప్యూటీ కమిషనర్ సురేష్, ఇన్‌చార్జ్ డీఆర్వో వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ చిరంజీవి, డ్వామా పీడీ వెంకటరమణయ్య, పత్తికొండ ఆర్డీఓ భరత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డీపీఓ భాస్కర్, గనుల శాఖ అధికారి రవిచంద్, డీటీసీ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యేలు, అధికారులు

కర్నూలు (టౌన్): కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామం జగన్నాథగట్టు వద్ద ఉన్న టిడ్కో గృహాలకు ఎదురుగా ఆరు ఎకరాల్లో గ్రీన్‌కో కంపెనీ సీఎస్ఆర్ నిధులతో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం, క్రీడా కాంప్లెక్స్‌కు మంగళవారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ కర్నూలులో కేంద్రీకృత స్టేడియం ఉండాలన్న ఉద్దేశంతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, కే.ఈ.శ్యాంబాబు, జయనాగేశ్వర రెడ్డి, బొగ్గుల దస్తగిరి మాట్లాడారు. కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, గ్రీన్ కో కంపెనీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ప్రాజక్టు డైరెక్టర్ నాయుడు, ఆర్డీఓ సందీప్ కుమార్ పాల్గొన్నారు.

ఆక్రమణలను ఉపేక్షించొద్దు

కర్నూలు (టౌన్): నగరంలో ఆక్రమణలను ఉపేక్షించవద్దని మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. మంగళవార సాయంత్రం స్థానిక నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో మున్సిపల్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు పట్టణ ప్రణాళిక విభాగం కృషి చేయాలన్నారు. ఆక్రమణలు తొలగించాలని, వెండర్స్ జోన్లను ఏర్పాటు చేయాలని, రహదారులపై తోపుడు బండ్లు నిలపకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో వీధి వ్యాపారులు ఎంత మంది ఉన్నారో? ఎంత మంది అనుమతులు తీసుకున్నారో? తనకు వారం రోజుల్లో నివేదిక అందజేయాలన్నారు.

– అభివృద్ధి పనులు చేపట్టే కాంట్రాక్టర్లు 5 శాతం కన్నా ఎక్కువ లెస్‌కు పోవద్దని మంత్రి సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. క్వాలిటీ కంట్రోల్ బోర్డు ద్వారా నాణ్యత ప్రమాణాలు తనిఖీ చేశాకే బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

షోకాజ్ నోటీసులు ఇవ్వడం తగదు

కర్నూలు(సెంట్రల్): యోగాంధ్ర పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు హాజరు కాని సచివాలయ ఉద్యోగులకు నోటీసులు ఇవ్వడం మునిసిపల్ కమిషనర్‌కు తగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు నగర పాలక సంస్థలో నిర్వహిస్తున్న యోగా కార్యక్రమాలకు ఉద్యోగులు సకాలంలో హాజరు కావడం లేదని కమిషనర్ షోకాజ్ నోటీసులు ఇవ్వడం సబబు కాదన్నారు. నెల రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలకు ఉద్యోగులు హాజరవుతున్నారని, ఒక రోజు హాజరుకాకపోతే నోటీసులు ఇస్తామని భయభ్రాంతులకు గురి చేయడం అన్యాయమని వాపోయారు.

జమ్మన్న మృతి తీరని లోటు

కర్నూలు(సెంట్రల్): జమ్మన్న మృతి ఉపాధ్యాయ ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం జిల్లా నాయకులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు, ఎండీ ఆనంద్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం వారు జమ్మన్న మృతదేహానికి ఆయన ఇంటి దగ్గర నివాళులర్పించారు. ప్రజా ఉద్యమాలకు వెన్నుదన్నుగా ఉండి పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాటాలు చేసిన వారి తరఫున జమ్మన్న నిలిచారన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై ఎనలేని పోరాటం చేశారన్నారు. ప్రజా ఉద్యమాలకు సైతం మద్దతుగా నిలిచారన్నారు.

19న పవర్ లిఫ్టింగ్ పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈ నెల 19న పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహణ కార్యదర్శి వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 96762 30361 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఓపెన్–టు– ఆల్ కేటగిరీ కింద ఈ పోటీలు ఉంటాయని, బాలబాలికలు ఈ పోటీలకు అర్హులని తెలిపారు. ఒలింపిక్ డే పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈ పోటీల్లో క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

క్రీడా స్ఫూర్తితో రాణించాలి

కర్నూలు (టౌన్): క్రీడా పోటీల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు గుడిపల్లి సురేందర్ సూచించారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో హ్యాండ్‌బాల్, కబడ్డీ అంతర్ పాఠశాలల బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. చదువు, క్రీడలు రైలు పట్టాలాంటివన్నారు. ప్రతి రోజు వార్తా పత్రికలు చదివి నాలెడ్జ్ పెంచుకోవాలన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, హాకీ అసోసియేషన్ ప్రతినిధి దాసరి సుధీర్, చిన్న సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

'ఈగల్' చేతికి సెక్యూరిటీ సేవలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు బోధనాసుపత్రి సెక్యూరిటీ సేవలు ఈగల్ హంటర్ సొల్యూషన్స్ అనే సంస్థ దక్కించుకుంది. ఈ నెల నుంచే ఈ సంస్థ తన సేవలను ఆసుపత్రిలో నిర్వహిస్తోంది. ఈ మేరకు మంగళవారం సంస్థ మేనేజర్ కే.జె. రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మను మర్యాదపూర్వకంగా కలిసి సంస్థ ఎంవోయూ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్నూలు మెడికల్ కాలేజీలో 40 మంది, ప్రభుత్వ ఆసుపత్రిలో 200 మంది, ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో 11 మంది, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో 60 మంది సెక్యూరిటీ గార్డులతో సేవలందిస్తామన్నారు. ప్రతి సెక్యూరిటీ గార్డుకు టోకుగా రూ.16 వేలకు పైగా జీతం వస్తుందని, పీఎఫ్, ఈఎస్ఐ మినహాయించుకుని ఒక్కొక్కరికి రూ.11వేల దాకా వస్తుందని తెలిపారు. త్వరలో సెక్యూరిటీ గార్డులకు నూతన యూనిఫాం అందజేస్తామన్నారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం



పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.నాగరాముడు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు దుయ్యబట్టారు. మంగళవారం సీఆర్ భవన్‌లో ఉద్యోగ, ఉపాధి, నిరుద్యోగ భృతి సాధించడం కోసం చేపట్టే ఉద్యమానికి సంబంధించిన పోస్టర్లను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూన్ 15 నుంచి జూలై 15వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి, నిరుద్యోగ భృతి కోసం పోరాటానికి దిగుతున్నట్లు చెప్పారు. తాము అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తానని సీఎం చంద్రబాబు చెప్పారని, ఉద్యోగాలు ఇవ్వని పక్షంలో నెలకు రూ.3 వేల గౌరవ వేతనం ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలకు సంబంధించి క్యాలెండర్‌ను విడుదల చేసి భర్తీ చేస్తానని చెప్పి పట్టించుకోవడంలేదన్నారు. చంద్రబాబు పాలనలో ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా 2.60 లక్షల మంది వలంటీర్లు, 90 వేల మంది ఎండీయూ ఆపరేటర్లను రోడ్డుపాలు చేశారని మండిపడ్డారు. ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరుతూ.. ఈ నెల 20న కర్నూలు జిల్లాలో కలెక్టర్ కార్యాలయం నుంచి సీఎం చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్‌నజీర్‌కు అర్జీలు పంపించే కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ పోరాటంలో నిరుద్యోగ యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. నాయకులు నాగరాజు, బీసన్న, చంటి, కాశీం, అఖిల్, శివ, రాజేష్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

పని గంటల పెంపుపై 20న ధర్నా



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్రాల్లోని కూటమి ప్రభుత్వాలు కార్మికులకు 8 గంటల పని స్థానంలో 12 గంటలు పనిచేయాలని, మహిళలు రాత్రివేళల్లోనూ ఉద్యోగాలు చేయాలని తీసుకున్న నిర్ణయాలపై 20న అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. మంగళవారం ఏఐటీయూసీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. 8 గంటల పని స్థానంలో 12 గంటల విధానాన్ని తీసుకురావడంతో కార్మికులు వెట్టి చాకిరి చేయాల్సి వస్తుందన్నారు. అలాగే అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సురేష్ నాయక్, ఏఐయూటీయూసీ జిల్లా కార్యదర్శి ఎం.నాగన్న పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



ఎర్రబురుజు సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పట్టణాల్లోని పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని వారికి 3 సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో రెండో రోజు పెద్దపాడు, ఎర్రబురుజు సచివాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఏడాది దాటినా ఆచరణలో పెట్టడం లేదన్నారు. ఒక్కరికి కూడా సెంటు స్థలం ఇవ్వలేదన్నారు. దీంతో పట్టణాల్లో మురికివాడల్లో నివసించే ప్రజలు అక్కడ సరైన సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారనిచెప్పారు. అలాగే ఇంటి నిర్మాణం కోసం కూడా రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. ఎస్ఎండీ షరీఫ్, డి.పార్వతయ్య, నాగస్వాములు, పెద్దపాడు నాయకులు గోపి, కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

గొలుసు దొంగలు యూపీ ముఠాగా గుర్తింపు

కర్నూలు: కర్నూలులో ఈనెల 10వ తేదీన గంటన్నర వ్యవధిలో మూడు చోట్ల గొలుసు దొంగతనాలకు పాల్పడింది ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముఠాగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. కర్నూలు అర్బన్ తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకాయపల్లె అపూర్వ హోమ్స్ కాలనీలో నివాసముండే లక్ష్మీదేవికి చెందిన 3 తులాల బంగారు గొలుసు, అలాగే మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాద్రి నగర్‌కు చెందిన యశోధ మెడలో మూడున్నర తులాల బంగారు గొలుసు, నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంతోష్ నగర్‌లో నివాసముంటున్న భాగ్యలక్ష్మి మెడలోని 2 తులాల బంగారు గొలుసును ఇద్దరు దుండగులు ద్విచక్ర వాహనంపై వెంబడించి లాక్కొని పరారయ్యారు. అదే రోజు డోన్, నంద్యాల ప్రాంతాల్లో కూడా ఇదే ముఠా సభ్యులు గొలుసు దొంగతనాలకు పాల్పడి కర్నూలు మీదుగా హైదరాబాదుకు వెళ్లి అక్కడ కూడా మూడు చోట్ల గొలుసు దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలినట్లు సమాచారం. సెల్‌ఫోన్ డంప్, సీసీ కెమెరాల ఆధారంగా దొంగలను ఉత్తరప్రదేశ్ వాసులుగా గుర్తించినట్లు తెలిసింది. వారు వాడిన ద్విచక్ర వాహనం ఉత్తరప్రదేశ్ రిజిస్ట్రేషన్‌తో ఉన్నట్లు సీసీ ఫుటేజీలో ఆధారాలు లభించడంతో దొంగలను పట్టుకునేందుకు సీసీఎస్ పోలీసుల బృందం ఉత్తరప్రదేశ్‌కు వెళ్లినట్లు సమాచారం.

త్వరలో యోగా డిప్లొమా కోర్సు ప్రారంభం

– ఆర్‌యూ వీసీ వెంకట బసవరావు



యోగా గురువు దామోదర్ కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న వీసీ వెంకట బసవరావు, ప్రొఫెసర్లు

కర్నూలు కల్చరల్: త్వరలో యూనివర్సిటీలో యోగా డిప్లొమా కోర్సు ప్రారంభిస్తామని ఆర్‌యూ వీసీ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు అన్నారు. యోగాంధ్ర -2025 కార్యక్రమాల్లో భాగంగా 'మనసును పదును పెట్టుకోవడం ఆత్మను బలోపేతం చేసుకోవడం విద్యా నైపుణ్యాల కోసం యోగా' అనే అంశంపై వర్సిటీలో ఏర్పాటు చేసిన నాలుగు రోజుల వర్క్ షాప్‌ను వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీ, నంద్యాలకు చెందిన రాపర్తి రామా అకాడమీ ఆఫ్ యోగిక్ సైన్సెస్ సంయుక్త భాగస్వామ్యంతో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామన్నారు. యోగాంధ్ర -2025 మాసోత్సవాల స్ఫూర్తితో వర్సిటీలో యోగ సంబంధిత క్యాక్రమాలను నిరంతరం కొనసాగేలా చూస్తామన్నారు. యోగా కాన్షియస్‌నెస్ సెంటర్ ట్రస్టీ జి.దామోదర్ కుమార్‌రెడ్డి యోగా, యోగాసనాల సాధనతో కలిగే ప్రయోజనాలపై కీలక ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ బి. విజయ్ కుమార్‌నాయుడు ప్రిన్సిపాల్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి , సీడీసీ, ఎగ్జామినేషన్స్ డీన్ ఆచార్య పీవీ సుందరానంద్, రీసర్చ్ డైరెక్టర్ ఆచార్య సి. విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యోగా కార్యక్రమంలో పాల్గొన్న ఔత్సాహికులు

యోగా మన వారసత్వ సంపద



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్, మంత్రి, ఎంపీ, కమిషనర్



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

కర్నూలు(టౌన్): వేల సంవత్సరాల నుంచి వస్తున్న యోగా మన వారసత్వ సంపద అని మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు, విద్యార్థులు, ఎన్‌సీసీ విద్యార్థులు, మహిళలు, అధికారుల భాగస్వామ్యంతో 5 వేల మందితో థిమాటిక్ యోగా ప్రదర్శన నిర్వహించారు. యోగా శిక్షకులు మునిస్వామి యోగాసానాలు చేయించారు. మంత్రి మాట్లాడుతూ.. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో నిర్వహించే యోగా కార్యక్రమంలో పాల్గొనేందుకు 11 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, కలెక్టర్ పి.రంజిత్‌బాషా, మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు యోగా ప్రాముఖ్యతపై ప్రసంగించారు. ఆర్డీఓ సందీప్‌కుమార్, సెట్కూర్ సీఈఓ వేణుగోపాల్, జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి, డీఎస్‌డీఓ భూపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

లక్షల్లో ఫీజులు.. అరకొర వసతులు



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కర్నూలు సిటీ: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలో కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని, ఆ ఫీజులకు తగ్గట్లు విద్యార్థులకు వసతులు కల్పించడం లేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, షాబీర్ ఆరోపించారు. మంగళవారం కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల్లో అనుమతులు లేకుండా జరుగుతున్న పుస్తకాల విక్రయాలకు, అధిక ఫీజుల వసూళ్లకు వ్యతిరేకంగా ఆయా విద్యా సంస్థల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యా సంస్థల్లో పుస్తకాలను విక్రయిస్తూ వ్యాపారం చేయడం దారుణమని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. మాయ మాటలు, ఆకర్షణీయమైన కరపత్రాలతో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు చిన్నారుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయన్నారు. విద్యార్థుల నుంచి ఏపీఎల్, టెక్నో, ఈ-టెక్నో, ఐఐటీ, జేఈఈ, నీట్ వంటి పేర్లతో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారని, పిల్లలకు కనీస సదుపాయాలు లేకుండా స్కూళ్లను నిర్వహిస్తున్న వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనల అతిక్రమణపై విద్యాశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్నారు. డీఈఓ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆ సంఘం నాయకులు అభిరాం. అశోక్, సాయి, లోకేష్, అఖిల్, సమీర్, తదితరులు పాల్గొన్నారు.

ధూమపానంతో క్షయ ముప్పు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రఘు

కర్నూలు(హాస్పిటల్): పొగ తాగే అలవాటు ఉన్న వారికి క్షయ వ్యాధి వచ్చే అవకాశం ఉందని సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు చెప్పారు. ఆయన మంగళవారం కర్నూలు మండలం పడిదెంపాడు గ్రామంలో నిర్వహిస్తున్న టీబీ ముక్త అభియాన్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, 60 ఏళ్లు పైబడిన వారు, పొగ తాగేవారు, మద్యం సేవించేవారు, పౌష్టికాహార లోపం ఉన్న వారికి టీబీ గళ్ల పరీక్షలు, ఎక్స్‌రేలు చేయించాలన్నారు. ఇందులో భాగంగా నిక్షయ్ వాహన్, నిక్షయ్ శిబిరాలు ఏర్పాటు చేసి జన భగీదారిలో భాగంగా గ్రామంలో ప్రజలకు టీబీ గురించి తెలపాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్ అనిద్, ఆరోగ్య విస్తరణాధికారి వెంకటరమణ, పీహెచ్ఎన్ హనుమంతమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ నాగమణి, ఆరోగ్య కార్యకర్త కళావతి, ఎంఎల్‌హెచ్‌పీ సునీత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీడీ సర్వేపై క్వాలిటీ అసెస్‌మెంట్



సర్వేలో పాల్గొన్న వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): ఎన్‌సీడీ 3.ఓ సర్వేపై లాట్ క్వాలిటీ అసెస్‌మెంట్‌ను జిల్లాలోని ఐదు గ్రామాల్లో విజయవంతంగా నిర్వహించినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ కమ్యూనిటి మెడిసిన్ హెచ్ఓడీ డాక్టర్ సుధాకుమారి, ప్రొఫెసర్ సింధియా శుభప్రద చెప్పారు. ఐదుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఏడుగురు పీజీలు, 50 మంది ఇంటర్నీ వైద్యుల బృందం ఆధ్వర్యంలో లాట్ క్వాలిటీ అసిస్టెంట్ సర్వే చేసినట్లు చెప్పారు. గతంలో జరిగిన సర్వే ఎంత మేరకు సమర్థవంతంగా నిర్వహించారన్న దానిపై క్వాలిటీ అసెస్‌మెంట్ చేశామన్నారు. జిల్లాలోని బుక్కాపురం, గోరంట్ల, సి.బెళగల్, చింతమాన్‌పల్లె, ఆరెకల్, మాచాపురం గ్రామాల్లో ర్యాండమ్‌గా 600 శాంపిల్స్ అసెస్‌మెంట్ కోసం ఎంపిక చేసి, గ్రామాల్లో వారి ఇళ్ల వద్దకు వెళ్లిన వైద్య బృందం మళ్లీ పరీక్షలు చేసి గతంలో జరిగిన సర్వేపై అసెస్‌మెంట్ చేశామన్నారు. సేకరించిన 600 శాంపిల్స్‌ను విశ్లేషణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. సర్వేలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ పుష్పలత, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ వైష్ణవి, డాక్టర్ ప్రసన్నరాణి తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య డీఎంహెచ్‌ఓగా వెంకట నరసయ్య

కర్నూలు(హాస్పిటల్): ప్రాంతీయ శిక్షణ కేంద్రం (ఫిమేల్) ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ వెంకట నరసయ్య అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన కౌన్సిలింగ్‌లో ఆయన బదిలీ అయ్యారు. ఆయనతో పాటు శిక్షణా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రంగారెడ్డి ప్యాపిలి పీహెచ్‌సీకి, డాక్టర్ కరుణ దైవందిన్నె పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు.